
ప్రజాశక్తి

మంగళవారం 7 మే 2024

I

అల్లూరి సీతారామరాజు



నేడు, రేపు బృందాకరత్ రోడ్‌షో



ప్రజాశక్తి - అరకులోయ : సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలంటూ ఈ నెల 7, 8 తేదీల్లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో పర్యటించనున్నారు. 7న అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో ఆమె రోడ్‌షోలో పాల్గొంటారు. ఈ క్రమంలో మంగళవారం అరకు వేలీ మెయిన్ రోడ్‌లో తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, పార్టీ అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బృందాకరత్ పర్యటన 8న పాడేరు, చింతపల్లిల్లో కొనసాగుతుంది.

ప్రజా సమస్యలపై పోరాడే

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

బహిరంగ సభలో వక్తలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ సోమవారం రాజవొమ్మంగి నూకలమ్మ గుడి సమీపంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముందుగా బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు తదితరులకు సిపిఎం, కాంగ్రెస్ శ్రేణులు డప్పుల వాయిద్యాలు, తీన్మార్, ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు పూలమాలలు వేసి, నుదుట తిలకం దిద్ది హారతులు పట్టారు. అనంతరం సిపిఎం నాయకులు ముందు నడవగా, భారీగా తరలివచ్చిన ప్రజలు రాజవొమ్మంగి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వారికి స్థానికులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థి లోత రామారావు సర్పంచ్‌గా తమ పంచాయతీని సుమారు రూ.7 కోట్లుతో అభివృద్ధి చేశారని, అటువంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తేవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తారని తెలిపారు. టిడిపి, వైసిపి పాలనలో ఏజెన్సీలో గిరిజనులకు ఇళ్లను కూడా నిర్మించలేదని, సాగు భూములకు పోడు పట్టాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. టిడిపి, బిజెపి, వైసిపి అభ్యర్థులందరూ కోటీశ్వరులని, వాళ్ల కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచి, ఆ డబ్బులు ఎలా రాబెట్టుకోవాలని చూస్తారు తప్ప ప్రజలకు మేలు చేసే చట్టాలను చేరని పేర్కొన్నారు. అటువంటివారిని గెలిపిస్తే రాష్ట్రాన్ని, దేశాన్ని అమ్మకానికి పెడతారన్నారు.

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందకపోవడానికి ఈ ప్రాంత పాలకులే కారణమన్నారు.



సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును పరిచయం చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ప్రదర్శన అగ్రభాగాన కళాకారుల డప్పుల వాయిద్యాలు

నియోజకవర్గం సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన లేనివారు ఎన్నిక కావడంతో వారు వీటిపై దృష్టి పెట్టడం లేదన్నారు. 18 సంవత్సరాలుగా ప్రజల్లో ఉంటూ అనేక ఉద్యమాలు చేసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారానికి పూర్తిస్థాయిలో పనిచేస్తానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గంలోని ప్రధానమైన పోలవరం నిర్వాసితులు, రైతుల సాగునీరు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒత్తిడి తెస్తానని, విద్యా, వైద్యం, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాల కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎం పేదల పార్టీ అని, గిరిజన, గిరిజనేతరులను వేరుగా చూసే పార్టీ కాదని తెలిపారు. సిపిఎం గెలిస్తే గత 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో విలువైన ఖనిజాలు, అటవీ సంపదను దోచుకుంటున్న నియంత అనంతబాబు వంటి వారికి వ్యతిరేకంగా పోరాడుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం గెలుపు ఖాయమన్నారు. ప్రజలంతా సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలీ, సిహెచ్.సతీష్, జర్తా లక్ష్మి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకుడు వీరబాబు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న వివేకానందన్

పోలింగ్‌ను విజయవంతం చేయండి

ఎన్నికల సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను విజయ వంతం చేయాలని సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు స్థానిక గురుకుల కళాశాలలో నిర్వహించిన రెండవ విడత శిక్షణ ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను, వాట్సాప్ గ్రూపులలో ఉన్న పోలింగ్ ప్రక్రియపై రూపొందించిన వీడియోలను పరిశీలించి ఎన్నికల విధులను నిర్వహించాలని సూచించారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, బాధ్యతా యుతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో 242 మంది కి, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజ వర్గం పరిధిలో 230 మందికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి పాట్ నిర్వహణ, పి. ఓ డైరీ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఫారం 17సి, మాక్‌పోల్ సర్టిఫికేట్, బ్లాక్ కవర్ సర్టిఫికేట్లను నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, పిఓలు, ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం పని తీరు భేష్

పాడేరు:- జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కమేండ్ కంట్రోల్ కేంద్రంలో వివిధ విభాగాల పని తీరును ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్ ప్రశంసించారు. సోమవారం కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వివిధ విభాగాలను పరిశీలించారు. సోషల్ మీడియాలో ప్రచురితమైన ప్రకటనలు, ట్రోలింగ్‌లు, పెయిడ్ న్యూస్, తదితర అంశాలపై ఆరా తీసారు. ఫిర్యాదుల విభాగం, బోర్డర్ చెకింగ్ వెబ్ లైవ్, ఎంసిసి ఉల్లంఘనలు, సీజర్స్ వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాలు నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మరో వారం రోజుల పాటు కష్టపడి భాద్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భనలో ఆయా విభాగాల అధికారులు ఎం.శివయ్య, సాయి నవీన్, పి.గోవిందరాజులు, పి.రాములు, రమేష్ కుమార్‌రావు, ఎల్.బి వెంకటరావు పాల్గొన్నారు.

పిడిఎంఎస్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులకు, సిబ్బందికి పిడిఎంఎస్ యాప్‌పై శిక్షణ ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ స్కూల్లో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు, సెక్టార్, రూట్ అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను రిటర్నింగ్ అధికారి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలకు 59 మంది సెక్టార్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు నిర్వహించు అధికారులకు, సిబ్బందికి పిడియంయస్ యాప్ ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించిన వివరాలన్నీ పోలింగ్ రోజున ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని తీసుకొని వెళ్లి, తిరిగి అప్పగించేంత వరకు పిఓలు, ఏపీఓలదే బాధ్యతని తెలిపారు. 399 పోలింగ్ కేంద్రాలలో 118 పోలింగ్ కేంద్రాలలో సిగ్నల్ సరిగా ఉండని కారణంగా ఎప్పటికప్పుడు పోలింగ్ వివరాలు తెలిపే విధంగా రన్నర్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గుర్తేడు, పాతకోట రెండు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మెటీరియల్ 13వ తారీకు ఎన్నికల అనంతరం రంపచోడవరం తీసుకువచ్చే విధంగా హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 13న ఉదయం 7 నుండి సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు ఏవి రమణ, జ్యోతికృష్ణ, సత్యనారాయణ, చలపతిరావు, నజీముల్లా, డిప్యూటీ తాసిల్దారులు బి రాజు, శివ, శ్రీధర్, స్వామి, ఏ.సత్యనారాయణ, విశ్వనాథ్, సరిత, బాలాజీ, రవీంద్రబాబు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

మినీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -మారేడుమిల్లి

మారేడుమిల్లి, చింతూరు గిరిజన గురుకుల పాఠశాలలు, విఆర్.పురం మినీ గురుకుల పాఠశాలలో మూడవ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూరజ్ గనోరే సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుమిల్లి పాఠశాలలో 3వ తరగతి ఇంగ్లీష్ మీడియం 80 సీట్లుతో పాటు 4వ తరగతిలో 45 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. చింతూరు పాఠశాలలో 3వ తరగతి ఇంగ్లీష్ మీడియం 80 సీట్లు, విఆర్ పురం పాఠశాలలో 3వ తరగతి ఇంగ్లీష్ మీడియం 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆయా పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్ ఫారంతో పాటు, రెండవ తరగతి చదివిన పాఠశాల రికార్డు షీట్, టీసీ, విద్యార్థి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్‌లు, ఒక్కో పాస్ పోర్ట్ సైజు ఫోటోను జతచేసి ఈనెల 20వ తేదీ లోగా అందజేయాలని కోరారు. లాటరీ పద్ధతి ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీ రామచంద్రపాలెం గ్రామంలో సోమవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో వైసిపి పార్టీ నుండి పలువురు చేశారు. టిడిపి పార్టీలోకి 15 కుంటుంబాలు చేరినట్టు ఆమె తెలిపారు. వీరికి గిడ్డి ఈశ్వరి పార్టీ కండువాలు వేసి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి

- దుర్గం గ్రామస్తులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ నుంచి దుర్గం గ్రామం వరకు తారు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ పల్లి కొండలరావు కోరారు. మండలంలోని సోమవారం ఆ గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి లేక గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బొడ్డపుట్టు నుంచి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హైమావతి, దేవుడు నాయుడు, కృష్ణారావు, మూర్తి, బాలకృష్ణ, గ్రామస్తులు బొంజు బాబు, రాజారావు, సుందర్‌రావు, కొండబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు, నాయకులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: తలారిసింగి గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సోమవారం సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగుల కోసం ఈ నెల 5 నుంచి ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లపై ప్రభుత్వ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకొని ఓటు వేయాలన్నారు. అంతకు ముందుడిగ్రీ కళాశాలలో ఏర్పాటు స్ట్రాంగ్ రూమును సందర్శించారు.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి -పాడేరు: ఎన్నికల దృష్ట్యా అల్లూరి జిల్లాలో ఉన్న పలు ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి ఎం.విజయ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఎన్నికల పోలింగ్ నిర్వహించుటకు, సిబ్బంది, సామాగ్రి తరలించడానికి ఘాట్ రోడ్లలో ఏ విధమైన అంతరాయం రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈనెల 10 నుండి 14వ తేదీ వరకు జిల్లాలో పాడేరు ఘాట్, లంబసింగి ఘాట్, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్) రోడ్ల పై భారీ వాహనాలు నిషేధించామన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారం



కూనవరం మండలంలో ప్రచారంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

కూనవరం : కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ (ఇండియా వేదిక) పార్టీలు బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ కూనవరం మండలం బొజ్జరాయి గూడెం, టేకులొద్ది, అభిచర్ల, గొమ్ము అయ్యవారిగూడెం, కొండాయిగూడెం సోమవారం సిపిఎం నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీలతో సంబంధం లేకుండా పోలవరం ముంపు నిత్వాసితులందరి తరపున పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నాయకులు బొగ్గా సుబ్బయ్య, నానుపల్లి వెంకటేశ్వరావు, బొగ్గ రామారావు, సర్పంచ్ సోడే శంకర్, రవ్వ ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, న్యాయవాది రవితేజ, తెలంగాణా సీటీయూ నాయకులు మధు, ఆవుల ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలం ములకనపల్లి జోన్ పరిధి కుంజవారిగూడెం, మోసం గుంపు, మడివి గుంపు, పిసం గుంపు, సరియం గుంపు, పొడియం గుంపు, మధ్య గుంపు, కుందులూరు జోన్‌లో పరిధిలోని గ్రామాల్లో సోమవారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ముల్కనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, కె.సత్యనారాయణ, శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్య కార్యకర్తల సమావేశం

విఆర్.పురం మండలంలోని రామవరం జోన్ పరిధి చొప్పల్లి గ్రామంలో సోమవారం సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నెల 9న కూనవరంలో జరుగు బహిరంగ సభ జయప్రదానికి జనసమీకరణపై చర్చించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్లది రమేష్, శ్రీరామగిరి శాఖ సెక్రెటరీ గుండుపూడి లక్ష్మణరావు, పార్టీ నాయకులు పులి బుజ్జి, కన్నయ్య, దూలయ్య, కారం సత్తిబాబు, దేసయ్య పాల్గొన్నారు.

సిపిఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈ నెల 9న హాజరు కానున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం. చిన్నబాబు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దేశంలో బిజెపిని ఓడించటం, రాజ్యాంగాన్ని, ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన పార్టీలను, దానికి వత్తాసు పలుకుతున్న వైసిపిని ఓడించటం నేడు ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

దుంబ్రిగుడ: ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్శకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో సిపిఎం పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. కంద్రం పంచాయితీ బయలుగుడ, కొరంజిగూడ, పతలంగి, కుకుడబిడ్డ గ్రామాల్లో సిపిఎం మండల నాయకుడు టి.సూర్యనారాయణ, కించమండ పంచాయతీుం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, గసభ పంచాయితీ జోడిగూడలో మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ముంచింగిపుట్టు: ఇండియా ఫోరం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైస్ పర్సన్ పాచిపెంట శాంతకుమారి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్, శంకర్రావు, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యానారాయణలు ప్రచారం చేశారు. మండలంలో కిలగాడ, పడాల్పుట్టు, సుజనకోట, కొత్తసుజనకోట, బొడ్డపుట్టు, దోడిపుట్, మాకవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగధరస్వామిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్ధించారు. బుంగపుట్టులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గాసిరం దొర, మండల కమిటీ సభ్యులు ఎం ం శ్రీను, నర్సింగ్ పడాల్, జర్రెల పంచాయతీ మాజీ సర్పంచ్ వంతల లైకోన్, నీలకంఠ, సువాబి , మంగ్లన్న, టీ.గణపతి, గోపాల్ పాల్గొన్నారు.

పెదబయలు: పెదబయలు వారపు సంతలో సిపిఎం నాయకులు కిల్లో సురేంద్ర, బోండా సన్నిబాబు, శ్రీనివాసరావులు ప్రచారం చేపట్టారు.వారపు సంతలో కరపత్రాలను పంపిణి చేశారు. అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపిలకు ఓటేస్తే బిజెపికి వేసినట్టేనన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మండల నాయకులు శరబన్న ,వైస్ ప్రెసిడెంట్ గంగాధరం పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గత్తుందుర్గం, జంగంపుట్టు, జీలుగులుపుట్టు, డాలింపుట్టులో సిపిఎం జిల్లా నాయకులు దేవుడునాయుడు, హైమావతి మాట్లాడుతూ, తాగునీరు, రహదారి వంటి మౌలిక సదుపాయాలు కల్పనకై సిపిఎం అభ్యర్థి అప్పలనరసకే ఓటు వేయాలన్నారు. హక్కులు, చట్టాల కోసం పోరాటం చేసేది సిపిఎంయే అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు లక్ష్మణ్, కృష్ణారావు, సోమన్న, కృష్ణమూర్తి, బాలకష్ట, మూర్తి, బాలన్న పాల్గొన్నారు.

అనంతగిరి: అనంతగిరి వారపు సంతలో సీపీఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు, కాంగ్రెస్ నేతల ఆధ్వర్యాన ప్రచార ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఎగువ శోభ పంచాయతీ మర్రిగుడలో ప్రారంభమైన ర్యాలీ బొడ్డ చెట్టు కొలని మీదుగా వారపు సంత మీదుగా నిర్వహించారు జెడ్‌పిటిసి గంగరాజు మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టల రక్షణకు సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, నాయకులు దేవన్న, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అప్పలరాజు, అప్పలస్వామి పాల్గొన్నారు



పెదబయలు వారపు సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

9న బహిరంగ సభను జయప్రదం చేయాలి



అనంతగిరి వారపు సంతలో ప్రచారం చేస్తున్న గంగరాజు తదితరులు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు స్పందన

- ఓటు హక్కు వినియోగించుకున్న 842 మంది ఉద్యోగులు

-రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అనూహ్య స్పందన వచ్చింది. మూడవ రోజు 842 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను సద్వినియోగం చేసుకున్నారని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీఓ స్వయంగా దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. సోమవారం స్థానిక కంకబొంగుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ లో 842 మంది ఉద్యోగులు ఓటింగ్ లో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను నిర్వహించారు. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 753 మంది, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి 30 మంది, ఇతర జిల్లాల నుండి 59 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ లో ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఈనెల 8వ తేదీ వరకు అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓటు హక్కు విధులు నిర్వర్తించే ఇతర జిల్లాల కు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా బ్యాలెట్ ఓటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిదవ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం, పాడేరు, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది, అధికారులు, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకున్నారని పాడేరు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిస్ట్ తెలిపారు. మూడవ రోజైన సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ విధానంలో 864 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆమె వివరించారు. నియోజక వర్గ పరిధిలో పోలింగ్‌కు 15 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారని తెలిపారు. పాడేరు నియోజక వర్గంలో గుర్తించిన 68 మంది హోమ్ ఓటర్లలో 64 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారని జేసి వివరించారు.

సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే అధికారులు సిబ్బంది వారికి నచ్చిన అభ్యర్థులకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ స్కూల్లో ఎన్నికల విధులకు నియమించిన సిబ్బందికి, అధికారులకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్న ప్రక్రియను రిటర్నింగ్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పరిధిలో ప్రస్తుతం 4,457 మంది పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 1209 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం జరిగిందని, పాడేరుకు చెందిన ముగ్గురు, ఇతర జిల్లాలకు చెందిన 155 మంది పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

సావ్వలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి- దుంబ్రిగుడ:అరకు పార్లమెంట్, అసెంబ్లీ వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎంపీపీ బి.ఈశ్వరి ఆధ్వర్యంలో సావ్వ పంచాయతీ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ పి.సోయిత, నాయకులు దున్ను, తిరుపతి, రఘునాథ్ ,రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని అల్లూరి పార్కు

పట్టించుకోని ప్రభుత్వాలు

నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి

ప్రజాశక్తి-గొలుగొండ:అల్లూరి సీతారామరాజు సమాధులు ఉన్న పార్క్ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో అల్లూరి సమాధుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం శోచనీయం. అల్లూరి జయంతి, వర్ధంతి సందర్భంగా భారీ సభలు ఏర్పాటు చేసి అమలుకు నోచుకోని హామీలను ప్రకటించడం తప్ప అవి ఆచరణలోకి రాక ఏ విధమైన అభివృద్ధి కూడా ఇక్కడ కానరాలేదు. ఈ పార్కు నిర్వహణపై నీలి నీడలు అలుముకున్నాయి. ఈ నెల 7న అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం. పాలకుల నిర్లక్ష్యంతో అల్లూరి పార్కు శిథిలంగా దర్శనమిస్తోంది. పార్క్‌ను సందర్శించేందుకు పలువురు పర్యాటకులు కార్తిక మాసం, వేసవి సెలవుల్లో ఎక్కువగా వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని పర్యటకంగా తీర్చిదిద్దుతామని నాడు తెలుగుదేశం ప్రభుత్వం, నేడు వైసిపి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. పార్కులో సీతారామరాజు, గంటందొర సమాదుల షెడ్ల పైకప్పులు పెచ్చులూడు తున్నాయి. సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు చొప్పగడ్డితో నిర్మించిన షెడ్లు శిథిలమవతున్నా పట్టించుకునే నాధుడే లేడు. టూరిజం శాఖ కనీసం మరమ్మత్తులు కూడా చేపట్టలేదు.



శిథిలావస్థలో ఉన్న షెడ్డు

125 రూపే నాణేన్ని విడుదల చేయాలి

సీతారామరాజు ఆయన పేరున 125 రూపే నాణాన్ని విడుదల చేయాలి. పార్లమెంటులో అల్లూరి విగ్రహానికి అనుమతులు ఉన్నా ఎందుకు అవకాశం కల్పించడం లేదు. ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉంటే ఎన్ని లక్షలు ఖర్చయినా మా జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఖర్చుపెట్టి పార్లమెంట్‌లో విగ్రహం పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. చిత్తశుద్ధి ఉంటే మాకు అనుమతులు ఇవ్వండి. అల్లూరి చేసిన మన్యం విప్లవాన్ని గుర్తించినట్లయితే కేంద్ర ప్రభుత్వం వెంటనే 125 రూపే నాణెన్ని విడుదల చేయాలి. వర్ధంతిని కూడా ప్రభుత్వమే చేపట్టాలి

పడాల వీరభద్రరావు

అల్లూరి జాతీయ యువజన సంఘం అధ్యక్షులు.

జగన్ మళ్లీ గెలిస్తే రాష్ట్రం ఎడారే!

- టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఎడారి కావడం ఖాయమని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ధ్వజమెత్తారు. .సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నీతి ఆయోగ్ సూచనలను పక్కన పెట్టి ఎపిల్యాండ్ టైట్లింగ్ యాక్టును అడ్డగోలుగా అమలుకు పూనుకున్న వైసిపి ప్రభుత్వం, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మాట మార్చిందన్నారు. భూహక్కు చట్టం అమలైతే, యజమానుదారులు సర్వహక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఒక్కసారి అవకాశమిస్తేనే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి, మరోఛాన్సిస్తే అథోగతేనని మండిపడ్డారు.

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ఓటర్లు నడుంబిగించి, రాష్ట్రాన్ని ప్రజల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. సమావేశంలో టిడిపి దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఊరుకూటి నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గొంపా సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు పాల్గొన్నారు.

మండుటెండలోనూ వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 32వ వార్డు వైసిపి అధ్యక్షుడు మూలే రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రెండోరోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జాన్ వెస్లీ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు మండుటెండను సైతం లెక్కచేయకుండా స్థానిక నేతలు, మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. దక్షిణ వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సురపతి అప్పన్న, కొట్నాల రమేష్, యూత్ ప్రెసిడెంట్ కోటి, బంగారమ్మ, దేవా, బాబుల శ్రీను, గరికిన ఎల్లాజీ, భానుమూర్తి, కొణతాల కృష్ణవేణి, యలమశెట్టి లక్ష్మిభవాని, కుమారి, వై గోవింద్, పి.రాజారెడ్డి, నీరజ్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రం అడ్డతీగల, తిమ్మాపురం గ్రామాల్లో సిఐ రవికుమార్, ఎఎస్ఐ హనుమంతరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, రౌడీషీటర్లు, అల్లరి మూకలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. 100 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవసరమైనంత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమస్యాత్మక బూతులు వద్ద ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, గిరిజన యువత పెడదారి పట్టకుండా మంచి మార్గంలో నడవాలని వారికి తగు ప్రోత్సాహాలు ఇప్పటికే చేస్తున్నామని పేర్కొన్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగానే తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు రామన్న దొర, వీరభద్రరావు, హెడ్ కానిస్టేబుల్ హరి, కానిస్టేబుళ్ల రాంబాబు, దేవుడు, రాజ్ కుమార్, హోమ్‌గార్డు శేఖర్, మిలటరీ బెటాలియన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛను కష్టాలు



సీలేరు యూనియన్ బ్యాంకులో బారులుదీరిన పింఛన్ లబ్ధిదారులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు 6వ తేదీ వచ్చిన పింఛను కష్టాలు తీరలేదు. సీలేరు యూనియన్ బ్యాంకు ద్వారా పింఛన్లు పూర్తిస్థాయిలో పంపిణీ జరగకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకులో నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయకపోవడం వంటి సాంకేతికపరమైన సమస్యలతో పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతుంది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం అధిక శాతం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ల కోసం సీలేరు యూనియన్ బ్యాంక్ వద్ద బారులు తీరారు. మరో వైపు కొంతమందికి పింఛన్లు బ్యాంక్ ఖాతాలో పడకపోవడంతో వారు నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఎండలు మండి వడగాల్పులు ఎక్కువగా ఉండడంతో వృద్ధులు పింఛను సొమ్ము కోసం వచ్చి నానా అవస్థలు పడుతున్నారు. వాలంటీర్లు ఉన్నప్పుడు తమ చెంతకే వచ్చి పింఛన్లు ఇచ్చేవారని, కనీసం సచివాలయ సిబ్బంది ద్వారా అయినా ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేసి ఉంటే ఇటువంటి సమస్యలు తలెత్తేవి కాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బ్యాంకు వరండాలో పడిగాపులు కాస్తున్న వృద్ధ పింఛను లబ్ధిదారులు

శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసుల పటిష్ట చర్యలు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి :మారేడుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్రరాజు భీమరాజు ఆదేశాలతో గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని బోదులూరు, ఆకుమామిడికోట పరిసర ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్ బాంబ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యమైన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వై.రామవరం మండలం పాతకోట పంచాయితీ పరిధిలోని కిన్నర్ల గ్రామాన్ని సందర్శించి వచ్చే ఎన్నికలల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తేడు ఎస్సై సాయి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా వివిధ రకాల మందులును పంపిణీ చేశారు. వేసవి కాలంలో పాటించవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు.



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయికుమార్

నిలిచిన యూనియన్ బ్యాంకు ఎటిఎం సేవలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంక్ ఏటీఎం సేవలు రెండు రోజులుగా నిలిచిపోయాయి. ఆదివారం సెలవు దినం కావడంతో డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ఏటీఎంకి అనేకమంది వినియోగదారులు రాగా, అది పని చేయకపోవడంతో అసహనంతో వెనుతిరిగారు. ఏటీఎం అందుబాటులో ఉన్నా సక్రమంగా పనిచేయకపోవడం, సాంకేతిక లోపంతో తరచూ మరమ్మతులు గురి కావడం వినియోగదారులకు శాపంగా మారింది. సీలేరు దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల ప్రజలు సీలేరు యూనియన్ బ్యాంకు ఎటిఎంపై ఆధారపడి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు డబ్బులు అవసరమైనా ఏటీఎంకి వచ్చి విత్ డ్రా చేసుకొనేవారు. అయితే ఆదివారం నుండి ఎటిఎం నుండి డబ్బులు రాకపోవడంతో నిరాశ వెనుతిరిగారు. ఆది, సోమవారాల్లో ఏటీఎం పనిచేయకపోయినా బ్యాంక్ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టలేదని వినియోగదారుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటీఎం సక్రంగా పనిచేసే విధంగా బ్యాంక్ అధికారులు చర్యలు చేపట్టాలని వినియోగదారులు డిమాండ్ చేశారు.



మూతబడిన సీలేరు యూనియన్ బ్యాంకు ఎటిఎం

ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్

అధ్యక్షుడిగా బాబూరావు ఏకగ్రీవం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆర్.బాబూరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. సోమవారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు భీమారావు, శ్రీకాంత్, ఉమామహేశ్వరరావు, విక్రయ్, నాగరాజు పాల్గొన్నారు. కొత్త అధ్యక్షుడిని అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు అభినందించారు.



ఆర్.బాబూరావు

గుమ్మిరేవులులో

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపిపి చిన్నారావు, పక్కన మాజీ సర్పంచ్ నారాయణరావు

ప్రజాశక్తి-సీలేరు :జికె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి, ప్రజలందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జీకే వీధి మాజీ ఎంపీపీ ఎం.చల్లారావు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ మురళి నారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 1998 ఎన్నికల్లో అప్పట్లో రహదారి, బస్సు సౌకర్యాలు లేకపోయినా గుమ్మిరేవుల పంచాయతీలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారని, ఇప్పుడు రహదారి, బస్సు సౌకర్యాలు ఉన్నా తమ గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు.

దీంతో తమ పంచాయతీ పరిధిలోని ప్రజలు వచ్చే ఎన్నికల్లో మాదిగమల్లు స్కూల్ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు వెళ్లవలసి ఉందన్నారు. మాదిగముల్లు గ్రామానికి కాలినడకని వెళ్లవలసి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పంచాయతీ పరిధి పరమశింగవరం, దొరగొంది, కొండ జర్త, గుమ్మిరేవులు, కాకునూరు, చెరుకుమల్లు గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా 17వ నెంబర్ పోలింగ్ బూతును గుమ్మిరేవులులో ఏర్పాటు చేయాలని కోరారు.

చేసిన అప్పులకు జగన్ లెక్కలు చెప్పాలి

- తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని పునర్నిర్మిస్తామని అమిత్‌షా ప్రకటనపై తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో రూ.13.50లక్షల కోట్లు అప్పులు చేసి, ఆర్థిక నియంత్రణ లేకుండా ఖర్చుపెట్టిన సిఎం జగన్ దానికి బాధ్యత వహించాలని, ఆ డబ్బులకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. విధ్వంసం, అరాచకాలు, బలవంతపు అరెస్టులు, యథేచ్ఛగా మానవ హక్కులకు ఉల్లంఘనతో దుర్మార్గపు పాలన సాగించిన జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.వచ్చే ఎన్నికల్లో 175స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.